జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 11 | అక్టోబర్ | 2026 • పేజీలు : 10

## ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు 86 మంది గిరిజన విద్యార్థులు

- విద్యార్థులను అభినందించిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్




**భద్రాచలం, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనేందుకు గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలకు చెందిన 86 మంది విద్యార్థినీ విద్యార్థులను హైదరాబాద్‌కు పంపించినట్లు ఐటీడీఏ పిఓ బి.రాహుల్ తెలిపారు. శనివారం కాచనపల్లి క్రీడా పాఠశాలకు చెందిన 43 మంది బాలికలు, కిన్నెరసాని క్రీడా పాఠశాలకు చెందిన 43 మంది బాలురు వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, ఏఎస్ఓ సమక్షంలో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో

మిగతా 2 లో...

## ఏజెన్సీలో రాత్రి వేళ ఊక లారీల దందా..



- ఊక లారీల తెరవెనుక ఏం జరుగుతోంది..?
- వేస్ట్ కాదు.. బంగారమే..! ఊకతో లక్షల్లో లాభాలు...
- పగలు నిద్ర.. రాత్రి రవాణా..! ఓవర్ లోడ్‌తో టాక్స్ ఎగవేత..!!
- ఊక చాటున పీడీఎస్ బియ్యం, అక్రమ కలప స్మగ్లింగ్ జరుగుతుందా..?
- బిల్లు లేదు.. పర్మిట్ లేదు.. అయినా లారీలు జోరుగా..!
- బాయిలర్లకు ఇంధనంగా ఊక..! ఫ్యాక్టరీలకు అడ్డగోలు సరఫరా...
- మార్కెట్ కమిటీ నిబంధనలు బేఖాతరు - యథేచ్ఛగా అక్రమ తరలింపు...
- రాత్రి 10 దాటితే చాలు.. సబ్ డివిజన్ రోడ్లపై ఊక లారీల రాజ్యం...

2 లో...



3 లో...

## అద్భుతమైన లాలూచీ..?

- ఫుట్‌పాత్‌పై అడుగున్నర ఆక్రమణ.. తొలగించింది మాత్రం ఆరు అంగుళాల మెట్టే!
- పిల్లర్లు, గోడ జోలికి వెళ్లని 'టౌన్ ప్లానింగ్' అధికారులు!
- 'కూల్చేస్తాం' అని కోతలు.. క్షేత్రస్థాయిలో సర్దుబాట్లు..
- మరి దీనికి ఏ 'సామాజిక' అంశాలు పని చేశాయో..?

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటాం.. ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే నేలమట్టం చేస్తాం అని ఇన్ని రోజులు మీడియా ముందు గొప్పలకు పోయిన కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం (టౌన్ ప్లానింగ్) అధికారుల అసలు రంగు బయటపడింది. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సదరు అధికారుల తీరు తీవ్రమైన 'లాలూచీ' ధోరణిని తలపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా స్థలాన్ని కాపాడాల్సిన యంత్రాంగం, ఆక్రమణదారుడికి సాష్టాంగ నమస్కారం చేస్తూ నామమాత్రపు నాటకాలతో ప్రజల కళ్లల్లో దుమ్ము కొట్టే ప్రయత్నం చేయడంపై కొత్తగూడెం ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.

• భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

- ఆటపాటలతో అలరించిన మహిళలు, యువతులు
- పూల పండుగలో వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు



2 లో...

## వాడవాడల సద్దుల బతుకమ్మ సందడి!

## సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

- రూ.8.75 కోట్లతో కార్పొరేట్ స్థాయి విద్య.. ఎమ్మెల్యే కూనంనేని




**సుజాతనగర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జీవో నంబర్ 187 ద్వారా పాఠశాల అభివృద్ధికి

మిగతా 2 లో...

## సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు



(మొదటి పేజీ తరువాయి...)

రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత ఆంగ్ల మాధ్యమ విద్య అందించనున్నట్లు చెప్పారు. ఆధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా వసతులు కల్పిస్తామన్నారు. త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు సాధనకు కృషి చేస్తామని, మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డీఈవో వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ లాల్ సింగ్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు కాంగ్రెస్ నాయకుడు నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు 86 మంది గిరిజన విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి...)

పాల్గొనడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి విలువిద్య క్రీడాకారులను ప్రత్యక్షంగా చూసే అవకాశం విద్యార్థులకు లభిస్తుందని పీఓ పేర్కొన్నారు. ఇది గిరిజన విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంతోపాటు విలువిద్యలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. విద్యార్థులకు అనుమతి మంజూరు చేసి, ప్రయాణ సౌకర్యం కల్పించిన పీఓ బి.రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు చందనకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విలువిద్య అభివృద్ధికి సహకరిస్తున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్ చైర్మన్, నిర్వాహక బృందం, ఉమ్మడి ఖమ్మం జిల్లా విలువిద్య సంఘానికి క్రీడా అధికారి గోపాలరావు, ఏఎస్ఓ వెంకటనారాయణ, సోయం నాగేశ్వరరావు, రాంబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

- ఆటపాటలతో అలరించిన మహిళలు, యువతులు
- పూల పండుగలో వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు



# వాడవాడల సద్దుల బతుకమ్మ సందడి!

**ఇల్లందు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శనివారం వాడవాడల సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. వీధులు, కాలనీలు పూలపరిమళంతో నిండిపోగా పండుగ వాతావరణం నెలకొంది.

**పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణ**

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించారు. ఒక్కో బతుకమ్మను ఒక్కో ప్రత్యేకతతో పేర్చి తమ కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. సాయంత్రం వేళ బతుకమ్మలను ఒకచోట చేర్చి వాటి చుట్టూ చేరిన మహిళలు, యువతులు సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులు సైతం ఈ సంబరాల్లో పాల్గొనడంతో పండుగ సందడి మరింత పెరిగింది.

**ఆటపాటలతో మార్మోగిన వీధులు**

బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలు, చప్పట్లతో వాడవాడలా సందడి నెలకొంది. తరతరాలుగా వస్తున్న జానపద గేయాలను ఆలపిస్తూ మహిళలు తమ ఆనందాన్ని పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి వేడుకల్లో పాల్గొనడంతో పరస్పర ఆప్యాయతలు వెల్లివిరిశాయి. పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ ఆభరణాలు, పట్టుచీరలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ**

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుంది. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పూజించి, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పూల పండుగ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పారు.

**కొత్త తరానికి సంప్రదాయాల పరిచయం**

ఆధునిక జీవనశైలిలోనూ బతుకమ్మ పండుగకు మహిళలు, యువతులు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణ సంస్కృతిపై వారికున్న మమకారాన్ని తెలియజేస్తుంది. చిన్నారులు, యువతులు పెద్దలతో కలిసి బతుకమ్మ పాటలు నేర్చుకుంటూ సంప్రదాయాలను కొనసాగించడం విశేషం. వాడవాడలా నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి.

**పూల పండుగతో పులకించిన పల్లెలు, పట్టణాలు**

సద్దుల బతుకమ్మ వేడుకలతో ఎక్కడ చూసినా పండుగ శోభ కనిపించింది. మహిళలు, యువతుల కేరింతలు, బతుకమ్మ పాటలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు అద్దం పట్టిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలనే సందేశాన్ని సద్దుల బతుకమ్మ మరోసారి చాటిచెప్పింది.

# ఏజెన్సీలో రాత్రి వేళ ఊక లారీల దందా..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 10. ప్రజాజ్యోతి...**

భద్రాద్రి మణుగూరు సబ్ డివిజన్ ప్రాంతంలో రాత్రి 10 గంటలు దాటితే చాలు రోడ్లపై ఊక లారీలు వరుస కడుతున్నాయి. సాధారణంగా వేస్ట్ అనుకునే వరి ఊక వెనుక ఇప్పుడు లక్షల రూపాయల వ్యాపారం దాగి ఉంది. వరి మిల్లుల్లో వడ్లు మర ఆడిన తర్వాత వచ్చే పై పొట్టునే ఊక అంటారు. ఇది వేస్ట్ కాదు, బంగారంతో సమానం తెలుస్తోంది. పేపర్ మిల్లులు, స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీలలో బొగ్గుకు బదులుగా బాయిలర్లలో ఇంధనంగా దీనిని వాడుతున్నారు.

అలాగే కోళ్ల దాణా, పశువుల దాణా తయారీలో, ఇటుకలు, ప్లైవుడ్ తయారీలో కూడా దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ డిమాండ్ నే అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లు దగ్గర టన్ను ఊక 3000 రూపాయలు ఉంటే, ఫ్యాక్టరీలకు చేరేసరికి 6000 నుండి 7000 రూపాయల వరకు పలుకుతోంది. ఒక లారీలో 10నుండి 15టన్నులు పడుతుంది. అంటే ఒక్క ట్రిప్పుకే 30 నుండి 40 వేల వరకు లాభం వస్తోంది. ఈ లాభం కోసమే ఊక లారీల అక్రమ దందా మొదలైంది. పర్మిట్ లో 15 టన్నులు ఉంటే 25 టన్నుల వరకు ఓవర్ లోడ్ వేసి అర్ధరాత్రులు తరలుస్తున్నారు. దీనికి బిల్లు,జీఎస్టీ కట్టరు, దీంతో ప్రభుత్వానికి భారీగా పన్ను నష్టం వాటిల్లుతోంది.

**ఊక లారీలు రాత్రులే ఎందుకు పోతున్నాయి...**

అసలు విషయం ఏంటంటే ఈ ఊక లారీలన్నీ




రాత్రి పూటే ఎందుకు తిరుగుతున్నాయనేదే అందరి అనుమానం ఏర్పడింది.

పగటి పూట ఆర్టీఏ, పోలీసు చెక్ పోస్టుల్లో తనిఖీలు ఉంటాయని, పట్టుబడతామని భయంతో అక్రమార్కులు రాత్రి వేళను ఎంచుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ఊక లారీల చాటున మరో పెద్ద దందా కూడా నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. లారీ పైన ఊకను కప్పేసి లోపల పీడీఎస్ బియ్యాన్ని, అక్రమంగా కొట్టిన అటవీ కలపను తరలిస్తున్నారనే అనుమానాలు బలంగా వినపడుతున్నాయి. పగలు అయితే ఈజీగా దొరికిపోతారనే రాత్రి సమయంలోనే ఈ స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతోంది.

నిబంధనల ప్రకారం ఊకను ఒక జిల్లా నుండి మరో జిల్లాకు తరలించాలంటే మార్కెట్ కమిటీ అనుమతి, సరైన వేబిల్లు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇక్కడ తిరుగుతున్న చాలా లారీలకు ఆ అనుమతులే లేవు. ఎలాంటి పత్రాలు లేకుండా యథేచ్ఛగా రవాణా సాగిస్తున్నారు. దీనికి తోడు కొన్ని ఫ్యాక్టరీల యాజమాన్యాలు కూడా ఈ అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని కొంత సమాచారం. పగటి పూట కరెంటు సమస్యలు, పొల్యూషన్ కంట్రోల్ అధికారుల తనిఖీల భయంతో ఫ్యాక్టరీలు రాత్రి పూటనే ఊకను కొనుగోలు చేస్తున్నాయని తెలుస్తోంది.

**పన్ను ఎగవేత కోసమే ఈ కుంభకోణం...**

మణుగూరు సబ్ డివిజన్ ఏరియాలో రాత్రి వేళ కనిపించే ప్రతి ఊక లారీ వెనుక 90 శాతం అక్రమ రవాణా, ఓవర్ లోడ్, పన్ను ఎగవేత కోణం ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ దందాపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆర్టీఏ, సివిల్ సప్లై, మైనింగ్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేస్తే ఈ అక్రమ దందా మొత్తం బయటపడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పగటి పూట పొల్యూషన్ కంట్రోల్ అధికారుల తనిఖీలు ఉంటాయని, కరెంటు కోతలు ఉంటాయని, చాలా ఫ్యాక్టరీలు రాత్రి పూటనే ఊకను కొనుగోలు చేస్తున్నాయని తేటతెల్లం అవుతోంది. దీంతో రాత్రి వేళ ఊక లారీల రాకపోకలు మరింత పెరిగిపోతున్నాయి.

ఫలితంగా ఓవర్ లోడ్ తో వెళ్తున్న లారీల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, రాత్రి వేళ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని క్లుప్తంగా తెలుస్తోంది. ఈ దందాపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని ఆర్టీఏ, సివిల్ సప్లై, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ శాఖలతో సంయుక్తంగా రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలు చేపడితేనే ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు వాపోతున్నారు.

లేదంటే ప్రభుత్వానికి ఆదాయ నష్టం, ప్రజలకు ప్రమాదాలు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# అద్భుతమైన లాలూచీ..?

- ఫుట్‌పాత్‌పై అడుగున్నర ఆక్రమణ.. తొలగించింది మాత్రం ఆరు అంగుళాల మెట్టే!
- పిల్లర్లు, గోడ జోలికి వెళ్లని 'టౌన్ ప్లానింగ్' అధికారులు!
- 'కూల్చేస్తాం' అని కోతలు.. క్షేత్రస్థాయిలో సర్దుబాట్లు..
- మరి దీనికి ఏ 'సామాజిక' అంశాలు పని చేశాయో..?

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటాం.. ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే నేలమట్టం చేస్తాం అని ఇన్ని రోజులు మీడియా ముందు గొప్పలకు పోయిన కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం (టౌన్ ప్లానింగ్) అధికారుల అసలు రంగు బయటపడింది. క్షేత్రస్థాయికి వచ్చేసరికి సదరు అధికారుల తీరు తీవ్రమైన 'లాలూచీ' ధోరణిని తలపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా స్థలాన్ని కాపాడాల్సిన యంత్రాంగం, ఆక్రమణదారుడికి సాష్టాంగ నమస్కారం చేస్తూ నామ మాత్రపు నాటకాలతో ప్రజల కళ్లల్లో దుమ్ము కొట్టే ప్రయత్నం చేయడంపై కొత్తగూడెం ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.

- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

### పిల్లర్లు, గోడను ముట్టుకోలేదు.. ఆరు అంగుళాల మెట్టుతో సరిపెట్టేశారు!

ఎంజీ రోడ్డులోని సదరు భవన యజమాని నిబంధనలను పూర్తిగా కాలరాసి, ఫుట్‌పాత్‌పైకి ఏకంగా అడుగున్నర మేర ముందుకు వచ్చి భారీ పిల్లర్లతో పాటు గోడ నిర్మాణం చేపట్టినట్లు స్పష్టమైన ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, దాని ముందు మరో అరడుగు మేర మెట్లు కూడా నిర్మించారు. దీనిపై బాధితులు, స్థానికులు ఫిర్యాదులు చేయడంతో కొలతలు తీసి అక్రమ కట్టడాన్ని అడ్డుకుంటామని చెప్పిన అధికారులు.. చివరిగా క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చి ఆడిన నాటకం విస్మయానికి గురిచేసింది. ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తూ వెలిసిన పిల్లర్లు, గోడ జోలికి అస్సలు వెళ్లకుండా, కేవలం ముందున్న ఆరు అంగుళాల చిన్న మెట్టును మాత్రమే భవన యజమానితో చెప్పించి తీయించి 'గో గొప్ప పనులు చేశాం' అన్నట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారు.

### ఇదేనా మీరు చేసే డెమోలిషన్ దందా?

ఫుట్‌పాత్‌పైకి అడ్డగోలుగా వచ్చిన అడుగున్నర పిల్లర్లు, డ్రైనేజీపై లేచిన గోడ నిర్మాణం అలాగే ఉంటే, కేవలం ఆరు అంగుళాల మెట్టును తీసివేస్తే ఆక్రమణ తొలగిపోయినట్లేనా అని స్థానికులు అధికారులను సూటిగా నిలదీస్తున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం అక్కడ ఉండాల్సిన 'సెట్‌బ్యాక్' ఏమైంది? ప్రజా ధనంతో నిర్మించిన ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన పిల్లర్లను ఎందుకు కూల్చలేదు? అని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల ఈ కంటితుడుపు చర్యలు చూస్తుంటే ఆక్రమణదారుడితో ఏ స్థాయిలో కథ నడిపారో అర్థమవుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### రూపాయల వెల్లువ.. అధికారుల మౌనం!

అక్రమ నిర్మాణదారుడికి, కార్పొరేషన్ అధికారులకు నడుమ కుదిరిన ఈ "అద్భుతమైన లాలూచీ" వ్యవహారం వెనుక పెద్ద ఎత్తున సొమ్ములు చేతులు మారాయనే ఆరోపణలు పట్టణంలో గుసగుసలాడుతున్నాయి.

ఇలా మాటలకే పరిమితమై, చేతల్లో అక్రమార్కులకు అభయహస్తం ఇస్తున్న టౌన్ ప్లానింగ్ యంత్రాంగంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలి. నామమాత్రపు హెచ్చరికల ముసుగును తొలగించి, ఫుట్‌పాత్‌పై ఉన్న పిల్లర్లు, గోడ నిర్మాణాలను వెంటనే కూల్చివేసి ఆక్రమణను పూర్తిగా తొలగించాలని కొత్తగూడెం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఇన్ని రోజులు టీపీఓ చెప్పినవి ఇవే..!

ఎంజీ రోడ్డు అక్రమ నిర్మాణంపై గతంలో మీడియా ప్రశ్నించినప్పుడు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) గంభీరంగా ఇచ్చిన వివరణ ఇది.. "డ్రైనేజీపై లేదా ప్రజా స్థలంలోకి ఎంతైతే ముందుకు వచ్చారో ఆ నిర్మాణాన్ని కచ్చితంగా కూల్చివేస్తాం. అనుమతులు లేవని తేలితే చట్టప్రకారం ఎలాంటి జాలి దయా లేకుండా చర్యలు తీసుకుంటాం. భవన యజమాని కచ్చితంగా సెట్‌బ్యాక్ పాటించి తీరాల్సిందే.." తీరా క్షేత్రస్థాయిలో జరిగింది ఇది.. 'కచ్చితంగా కూల్చేస్తాం' అని చెప్పిన అధికారులు, ప్రత్యక్షంగా వచ్చి తొలగించింది మాత్రం కేవలం ఒక ఆరు అంగుళాల మెట్టు మాత్రమే! అడుగున్నర మేర ఫుట్‌పాత్‌పైకి వచ్చిన పిల్లర్లు, గోడ మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ఉన్నాయి. అధికారులు చెప్పిన మాటలకి, క్షేత్రస్థాయిలో చేసిన చేతలకి పొంతన ఉందో లేదో అధికారులే స్పష్టం చేయాలి. అయితే దీనికి ఏ సామాజిక అంశాలు పనిచేశాయో తేలాల్సి ఉంది.

## మృతి చెందిన రూపా సాయిదుర్గ కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణ చేసిన సిపిఐ నేతలు

**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 10, (ప్రజా జ్యోతి )** పాల్వంచ మండలం (మొండికట్ట ) సత్యనారాయణపురం గ్రామానికి చెందిన శెట్టి జీవరాజు, రోజా దంపతుల కుమార్తె రూప సాయి దుర్గ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది, ఈ సందర్భంగా శనివారం సాయి దుర్గ కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లిన సిపిఐ నేతలు 50 కేజీల బియ్యం వితరణ చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కామ్రేడ్ నిమ్మల రాంబాబు, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యుడు అల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల అధ్యక్షుడు కొంగర అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేములపల్లి శ్రీనివాస్ రావు, సిపిఐ మండల నాయకుడు చిల్లా కృష్ణ, సత్యనారాయణపురం సేల్స్ మెన్ దేవి, ప్రజాసంఘాల నాయకులు నిమ్మల మోహన్ రెడ్డి, సంపంగి నవీన్, బాదే చెన్నయ్య, ఓర్సు సారయ్య, విజయ్ కుమార్, వేముల నరేష్, అల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అధికార 'దర్పం'.. నడిరోడ్డుపైనే కారు పార్కింగ్!



- చిన్నబజార్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడి కారు హంగామా!
- గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా పట్టించుకోని అధికారులు!
- సామాన్యుల టూవీలర్ కనిపిస్తే చలాన్లు బాదే పోలీసులు.. నాయకుడి కారుపై ఎందుకు సైలెంట్..?
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అధికార పార్టీ నేతల వైఖరిపై ప్రజల ఆగ్రహం!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి :** అధికారం చేతిలో ఉంటే చట్టాలు, నిబంధనలు తమకు వర్తించవనే ధీమా అధికార పార్టీ నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అత్యంత రద్దీగా ఉండే చిన్నబజార్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పేరుతో ఉన్న కారు నడిరోడ్డుపై పార్క్ చేసి వెళ్లడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చిన్నబజార్ మార్గం ఎప్పుడూ వాహనాలు, కాలినడకన వెళ్లే కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటుంది. అటువంటి ప్రధాన రహదారిపై ఏకంగా 'కాంగ్రెస్ మండల అధ్యక్షుడు' అని ఉన్న బోర్డు కారును నడిరోడ్డులోనే పార్క్ చేసి వెళ్లిపోవడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణ ప్రజలు తమ వాహనాలు లేదా టూవీలర్లను ఐదు నిమిషాలు పక్కన నిలిపినా వెంటనే వచ్చి వీధి చివర వరకు పారదోలే ట్రాఫిక్ పోలీసులు గానీ, చలానాలు బాదే సిబ్బంది గానీ ఈ కారు వైపు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. దీంతో ఈ పరిణామంపై స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలువురు కాంగ్రెస్ నాయకుల తీరు వివాదాస్పదంగా మారుతుంటే, ఇప్పుడు నడిరోడ్డుపైనే వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే స్థాయికి వారి ధోరణి చేరిందని మండిపడుతున్నారు. దీంతో ఈ సీను చూసిన వాళ్లు చట్టం సామాన్యుడికి ఒకలా, అధికార పార్టీ నేతలకు మరొకలా పనిచేస్తుందా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీస్, ట్రాఫిక్ అధికారులు స్పందించి సదరు నాయకుడి వాహనంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో నేటి నుండి 20 వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఆలయ ఈవో విజయ్ కుమార్



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాధపురం గ్రామంలో కొలువు తీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగా దసరా ఉత్సవాలను పురస్కరించుకొని నేటి నుండి 20వ తేదీ వరకు ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో విజయ్ కుమార్ తెలిపారు, ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈవో మాట్లాడుతూ 11వ తేదీన ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవ కార్యక్రమాలను కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేనీ సాంబశివరావు ప్రారంభించినట్లు తెలిపారు, మహోత్సవంలో భాగంగా భాగంగా 10 రోజులపాటు అమ్మవారికి వివిధ అలంకరణలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు, ముఖ్యంగా విజయదశమి రోజు దేవస్థానం కోనేరు లో తెప్పోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, దసరా ఉత్సవాలు సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండడంతో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు,

## సీఐ వెంకటేశ్వర్లుకు పినపాక జర్నలిస్టుల సంఘం ఘన సన్మానం




**పినపాక, అక్టోబర్ 10(ప్రజాజ్యోతి)** విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ పోలీస్ శాఖకు విశేష సేవలు అందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లును పినపాక జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. పోలీస్ విధుల్లో నిబద్ధతతో వ్యవహరిస్తూ, కఠిన పరిస్థితుల్లోనూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లుకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ గుర్తింపు అందించడం అభినందనీయమని జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. పోలీస్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లును పినపాక జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు సత్రపల్లి సారయ్య, గౌరవ సలహాదారు కొత్త దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు వాగబోయిన సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి అత్య లక్ష్మణ్, కోశాధికారి కన్నె రమేష్, సభ్యులు రమణ, గోడిశాల చంద్రం, తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు చేస్తున్న సేవలను గుర్తించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని వారు అన్నారు. విధి నిర్వహణలో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజలకు విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు జర్నలిస్టుల సంఘం ప్రతినిధులతో మాట్లాడుతూ... అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ తమలక్ష్యమని ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు తన సేవలను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని సిఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 17న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

- తుడుందెబ్బ నాయకుల పిలుపు



**చర్ల, అక్టోబర్ 10: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తుడుందెబ్బ నాయకులు ప్రకటించారు. శనివారం చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయంలో సీనియర్ నాయకుడు తాటి రామకృష్ణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం రవికిరణ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోకి గిరిజనేతరులు అక్రమంగా ప్రవేశిస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధికారుల వ్యవహారశైలి, చట్టాల అమలులో నిర్లక్ష్యంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరుల దోపిడీని అరికట్టాలని, 1/70 చట్టం, భూమి బదలాయింపు నియంత్రణ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆదివాసుల హక్కులను పరిరక్షించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమస్యలు కేవలం తుడుందెబ్బకు సంబంధించినవి కావని, చర్ల మండలంలోని ఆదివాసీ సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్యలని అన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రతి గూడెం నుంచి ఆదివాసీ పెద్దలు, ఉద్యోగులు, యువతీ యువకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని అక్టోబర్ 17న నిర్వహించే తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ ఉపాధ్యక్షులు తుర్రం ఆదినారాయణ, పురిటి ప్రశాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కలం శ్రీనివాస్, కోశాధికారి సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, తుర్రం గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాపలాదారుడిని కాదు.. కౌలు రైతును!

- ఎమ్మార్వో నివేదిక, ల్యాండ్ ఓనర్లు మొత్తుకుంటున్నా నన్ను కాపలాదారుడంటారు ఏంది..?
- రౌడీషీటర్లు, ప్రైవేటు సెక్యూరిటీతో వందల మంది వచ్చి తోట నరికేస్తుంటే అండగా నిలిచేవారు ఏరీ?
- పిడియాక్ట్ పెడతామని బెదిరించారు.. 25 శాతం వాటాతో సెటిల్మెంట్ చేయాలని చూశారు!
- 3 నెలలుగా నిద్రలేని రాత్రులు.. చివరకు డీఎస్పీ ఆఫీస్ నుంచి పిలుపు వచ్చింది !
- బాధితుడైన లంబాడీ గిరిజన కౌలు రైతు అజ్మీరా మురళి 'ప్రజాజ్యోతి' వద్ద రోదన!



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 10, ప్రజాజ్యోతి :** "నన్ను కాపలాదారుడు అని అంటుంటే గుండె తరుక్కుపోతోంది సార్.. నేను కాపలాదారుడిని కాదు! ఈ నేలను నమ్ముకుని, చెమటోడ్చి పన్నెండేళ్ళ నుంచి జామాయిల్ తోట పండిస్తున్న పక్కా గిరిజన కౌలు రైతును! ఎమ్మార్వో ఆఫీస్ రికార్డుల్లోనూ, నన్ను నమ్మి భూమి ఇచ్చిన ఓనర్లు చెప్తున్నా.. నా కష్టాన్ని గుర్తించకుండా నన్ను 'కాపలాదారుడు' అని ముద్ర వేసి నా తోటను నాశనం చేస్తుంటే ఏ అధికారి కూడా నా వైపు నిలబడలేదు సార్.." అంటూ లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల భూవివాదంలో బాధితుడైన గిరిజన రైతు అజ్మీరా మురళి 'ప్రజాజ్యోతి' ఎదుట కన్నీరుమున్నీరయ్యారు. సరిగ్గా మాట్లాడటానికి స్పష్టమైన తెలుగు రాకపోయినా, తన మనస్సులో రగిలిపోతున్న ఆవేదనను, పొలంలో ఛిద్రమైన తన కష్టాన్ని తలుచుకుంటూ ఆయన వెళ్లగక్కిన కన్నీటి గాథ సమాజాన్ని ఆలోచింపజేస్తోంది.

### మూడోసారి కోసుకునే పంటను నాశనం చేశారు!

"రేగళ్ల సర్వే నంబర్ 14, 14/ట లో ఉన్న భూమిలో నేను పన్నెండేళ్ళ క్రితం రూపాయి రూపాయి కూడబెట్టి జామాయిల్ తోట వేశాను. రాత్రింబవళ్లు కష్టపడి చెట్లను పెంచాను. గతంలో రెండుసార్లు ఇదే తోట పంట కోసి అమ్ముకున్నాను. ఇది మూడోసారి కోతకు వచ్చిన సమయం. ఎప్పుడు లేనిది ఉన్నట్టుండి కొందరు వ్యక్తులు వచ్చి ఇక్కడ నాకేం సంబంధం లేదన్నట్టు ప్రవర్తించారు. వాళ్ల ఆస్తి గొడవలు, కుటుంబ తగాదాలు ఏమైనా ఉంటే వాళ్లు చూసుకోవాలి కానీ.. నేను కష్టపడి పెంచిన పంటను నన్ను కోసుకోనివ్వకుండా అడ్డుకోవడం ఎంతవరకు న్యాయం? నేను పోలీస్ స్టేషన్ చుట్టూ, రెవెన్యూ ఆఫీసు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాను. కానీ నా పట్ల ఒక్క అధికారి కూడా దయ చూపలేదు."

### 300 మందితో వచ్చి తోట నరికేశారు.. అడిగితే పిడియాక్ట్ బెదిరింపులు!

"ఒక్కసారిగా ప్రైవేట్ బాడీగార్డులను, సెక్యూరిటీని, వీడియో కెమెరాలను పెట్టుకుని సుమారు 250 నుంచి 300 మంది గుంపుగా వచ్చి నా తోటపై పడ్డారు. రౌడీషీటర్ల అండతో నా కళ్లముందే చెట్లను నరికేస్తుంటే తట్టుకోలేక పోలీసులకు మొరపెట్టుకున్నాను. కానీ అక్కడున్న పోలీస్ అధికారి నాకు అండగా నిలవాల్సింది పోయి.. 'నువ్వు అక్కడ ఎక్కువ మాట్లాడితే నీపైనే పిడియాక్ట్ పెడతాం' అని భయపెట్టారు. అంతేకాదు.. 'వారు నరికిన దాంట్లో 25 శాతం వాటా ఇస్తారంట, తీసుకొని సెటిల్మెంట్ చేసుకో' అని పోలీసులే నాతో చెప్పే ప్రయత్నం చేశారు. నా సొంత కష్టంతో పెంచిన పంటలో నా హక్కును వదులుకుని, వేరేవాడి దయాదాక్షిణ్యాలపై 25 శాతం వాటా ఎందుకు తీసుకోవాలి సార్? అందుకే నేను ఆ సెటిల్మెంట్లకు ఒప్పుకోలేదు."

### ఎమ్మార్వో చెప్పినా.. ఓనర్లు మొత్తుకున్నా వినలేదేంది..?

"నేను ఈ భూమిలో 12 ఏళ్ళుగా సాగు చేస్తున్నానని ఎమ్మార్వో గారు సర్వే చేసి, విచారణ జరిపి, రికార్డులు చూసి నివేదిక ఇచ్చారు. నన్ను నమ్మి కౌలుకు ఇచ్చిన భూయజమానులు కూడా 'మురళినే కౌలు రైతు' అని పదే పదే చెప్తున్నారు. చుట్టుపక్కల ఊళ్లల్లో ఏ ఒక్కరిని అడిగినా నేను ఎంత కష్టపడ్డానో చెప్తారు. ఇన్ని ఆధారాలు ఉన్నా నన్ను కేవలం 'కాపలాదారుడు' అని అబద్ధాలు చెప్తుంటే తట్టుకోలేకపోతున్నాను. నా రూపాయి రూపాయి పెట్టుబడి ఆ తోటలోనే ఉంది. ఇప్పుడు తోటంతా నాశనం అయిపోతే నేను నా కుటుంబంతో ఎలా బతకాలి సార్?"

### 3 నెలల తర్వాత డీఎస్పీ ఆఫీస్ నుంచి పిలుపు.. నెరవేరేనా న్యాయం?

"గత మూడు నెలలుగా నాకు అన్నం సహించడం లేదు.. రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయంతో రోజులు నెట్టుకొచ్చాను. అయితే శనివారం రోజు మొదటిసారిగా నాకు ఒక మంచి మాట వినపడింది. డీఎస్పీ గారి ఆఫీస్ నుంచి నాకు ఫోన్ వచ్చింది. మీ ఫిర్యాదు, సమస్య గురించి మాట్లాడటానికి రండి అని. నేను అక్కడికి వెళ్తే సార్ నా సమస్య విన్నారు. నా ఆవేదన అతనితో పూర్తిగా చెప్పుకున్నాను. చివరిగా సోమవారం ఆఫీస్‌కు రండి, మీ సమస్యకు పరిష్కారం చూపిస్తాం' అని చెప్పారు. గత మూడు నెలల తర్వాత ఒక పోలీస్ అధికారి నుంచి నాకు ఇటువంటి ఆశాజనకమైన ఫోన్ రావడం ఇదే తొలిసారి."

### కనీసం ఎఫ్ఐఆర్ అయినా నమోదు చేయండి!

"ఇప్పటికే నా పంట చాలావరకు నాశనమైపోయింది. నాకు జరిగిన నష్టంపై కనీసం ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాను. ఈ భూమి, ఈ పంట తప్ప నాకు వేరే ఆధారం లేదు. ఇందులో గనుక నాకు పూర్తిగా నష్టం జరిగితే నా పరిస్థితి ఏమవుతుందో నేను చెప్పలేను. దయచేసి అధికారులు, ప్రభుత్వం స్పందించి నా పంటను నాకు దక్కేలా చూసి, నన్ను ఆదుకోవాలి" అని గిరిజన రైతు అజ్మీరా మురళి దిక్కుతోచని స్థితిలో ధ్వంసం అయిన పంటను చూపిస్తూ కన్నీళ్లతో ప్రార్థిస్తున్నారు.

## సరస్వతి విద్యానికేతన్ లో వైభవంగా దసరా వేడుకలు





**చర్ల, అక్టోబర్ 10: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తేగడ లో గల శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రార్చన, నవకన్యా పూజ, రావణ దహనం, బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి విద్యార్థులకు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, నైతిక విలువలు, ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. శ్రీ చక్రార్చన ద్వారా దైవత్వం మన అంతరంగంలోనూ ఉంటుందని, మనసును పవిత్రంగా ఉంచుకుంటూ ఆత్మపరిశీలనతో ముందుకు సాగాలని తెలియజేశారు. నవకన్యా పూజ ద్వారా బాలికలను గౌరవించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. రావణ దహన కార్యక్రమం ద్వారా కోపం, అహంకారం, అసూయ, అబద్ధం వంటి చెడు గుణాలను విడిచిపెట్టి సన్మార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. బయట ఉన్న రావణుడిని దహనం చేయడం మాత్రమే కాకుండా, మనలోని దుర్గుణాలను జయించడమే నిజమైన విజయమని సందేశమిచ్చారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి ప్రకృతిపై ప్రేమను చాటారు. పూలు, చెట్లు, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, ధర్మం, మానవీయ విలువలను అలవర్చడమే తమ పాఠశాల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనలను, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా సాగాయి. శ్రీ సరస్వతి విద్యానికేతన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

# ఏజెన్సీలో పెసా చట్టాన్ని 100 శాతం అమలు చేయాలి!

- సర్పంచులు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం
- దశలవారీ ఉద్యమానికి జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం పిలుపు



**పినపాక, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టాన్ని (PESA Act) సంపూర్ణ స్థాయిలో అమలు చేయాలని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పినపాక మండలంలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగుల పింఛన్ల వెరిఫికేషన్ కోసం విచ్చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారిని (డీపీఓ) శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

**సర్పంచులు, ఉద్యోగుల సమస్యలపై వినతి**

ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామపంచాయతీల ప్రథమ పౌరులైన సర్పంచులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పంచాయతీరాజ్ శాఖలో నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై వస్తున్న ఒత్తిళ్లు, దాడులు, ఇతర సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు సంఘం నాయకులు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

**ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం పటిష్ఠంగా అమలయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దేవరాజన్ దివ్య, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, గిరిజన ప్రాంతాల్లో చట్టం నిర్దేశించిన హక్కులు, నిబంధనలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**చట్టం అమలయ్యే వరకు దశలవారీ ఉద్యమం**

ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం సంపూర్ణంగా అమలయ్యే వరకు జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. గిరిజన గ్రామాల హక్కుల పరిరక్షణ, గ్రామ పంచాయతీల బలోపేతం, సర్పంచులు మరియు పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు గొగ్గల ఆర్కే దొర, పినపాక మండల అధ్యక్షుడు కొమరం శ్రీను పాల్గొన్నారు.

# జర్నలిజంపై పోలీసులు అక్రమ కేసుల దాడి..

- పోలీసుల తీరుపై జర్నలిస్టు సంఘాల ఫైర్..!
- నిజ నిర్ధారణ లేకుండా ఎఫ్ఆర్ఐ లు ఎలా..?
- పోలీసులకు జర్నలిస్ట్ సంఘాలు సూటి ప్రశ్న...
- 40 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్.. ఒకే ఘటనకు రెండు తేదీల్లో ఫిర్యాదులు.. వెనుక రాజకీయ ఒత్తిళ్లా..?
- వార్త రాస్తే కేసా..? జర్నలిస్టుల గొంతు నొక్కితే సహించం - జర్నలిస్టు సంఘాల వార్నింగ్...



- అశ్వాపురంలో జర్నలిజంపై దాడి.. అక్రమ కేసులను ప్రతిఘటిస్తాం.. ఆందోళనకు సిద్ధం..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / అశ్వాపురం. అక్టోబర్ 10, ప్రజాజ్యోతి...** అశ్వాపురం మండలంలో జర్నలిస్టులపై వరుసగా అక్రమ కేసులు నమోదవుతుండటం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. పోలీసుల తీరుపై టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెలమ రాజేందర్, పినపాక నియోజకవర్గ తెలంగాణా యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజెయు) ఉపాధ్యక్షుడు రెడ్డి మహేష్ శనివారం అశ్వాపురంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, సమ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించేలా కేసులు పెట్టడం సభ్య సమాజానికి సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల ఒకే ఘటనకు సంబంధించి వేర్వేరు తేదీల్లో ఫిర్యాదులు తీసుకోవడం, ఫిర్యాదు చేసిన 40 రోజుల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానం వ్యక్తం చేశారు. నిజా నిజాలు పరిశీలించకుండా, ఎటువంటి విచారణ లేకుండా జర్నలిస్టులపై కేసులు ఎలా నమోదు చేస్తారని పోలీసులను సూటిగా ప్రశ్నించారు.

వార్తా సేకరణలో భాగంగా పనిచేసే జర్నలిస్టులపై వచ్చిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని, జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇటువంటి అక్రమ కేసులను ప్రతిఘటిస్తూ తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు

# ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యశాల

**చర్ల, అక్టోబర్ 10:(ప్రజా జ్యోతి):** భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని బీజేపీ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి, మహిళా ఎస్టీ మోర్చా నాయకురాలు ఉయిక సరోజిని అన్నారు. శనివారం చర్ల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నూప రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి



డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన అర్హులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 2026 నవంబర్ 1వ తేదీని ప్రామాణిక తేదీగా తీసుకుని, 2023 నవంబర్ 1వ తేదీ నాటికి లేదా అంతకంటే ముందే డిగ్రీ పూర్తి చేసిన వారు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దరఖాస్తు చేసుకునే నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉంటూ భారత పౌరులై ఉండాలని అర్హులైన పట్టభద్రులందరికీ ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ చర్ల మండల ప్రధాన కార్యదర్శి బి. సందీప్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గునూరి రమణ, జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు నూప లక్ష్మణ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు పి. వినయ్, పర్సిక సౌజన్య, మండల కార్యదర్శులు ముత్తవరపు శ్రీనివాసాచారి, చింతూరి విశ్వనాథ్, సంతపురి సతీష్, ఉయిక బాలకృష్ణ, పోడియం కనకరావు, పూనెం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు సాధ్యం

- శ్రీనివాస గుప్త



**చర్ల, అక్టోబర్ 10:(ప్రజా జ్యోతి):** విద్య జీవిత గమనాన్నే మార్చివేస్తుందని, పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల కలలను సాకారం చేయవచ్చని ప్రముఖ వ్యాపారి కొప్పరపు శ్రీనివాస గుప్త అన్నారు. బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని తన తల్లిదండ్రులు కొప్పరపు వెంకటనారాయణ, సరోజిని దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస గుప్త, ఆయన సతీమణి రేణుక దంపతులు వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలోని కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, 5 కిలోల ఫ్రీడమ్ వంట నూనె, 5 కిలోల కందిపప్పుతో పాటు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస గుప్త మాట్లాడుతూ చదువుతోనే జీవితానికి సార్థకత లభిస్తుందని, ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థి నిలయంలోని పిల్లల క్రమశిక్షణ తమను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ అవసరాలను తీర్చేందుకు తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా వనవాసీ కళ్యాణ పరిషత్ పనిచేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా బాలబాలికల కోసం అనేక వసతి గృహాలను ఏర్పాటు చేసి, విద్యతో పాటు వినయ విధేయతలను నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోందని వివరించారు. విద్యార్థి నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రభుత్వ సహాయం లేకుండా కేవలం దాతల సహకారంతోనే నిర్వహించబడుతోందని తెలిపారు. దేశభక్తి కలిగిన యువతను తీర్చిదిద్దుతున్న సంస్థకు దాతలు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గిరిజనుల అభ్యున్నతి కోసం సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిలయ ప్రముఖ్ సంతోష్, స్థానికులు ముదిగొండ సతీష్, బర్ల సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై చర్లలో నిరసన



**చర్ల, అక్టోబర్ 10:(ప్రజా జ్యోతి):** దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని అణచివేయడం ఎవరి తరం కాదని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ అన్నారు. ఇలాంటి చర్యలతో ఉద్యమాలు మరింత ఉవ్వెత్తున ఎగసిపడతాయని హెచ్చరించారు. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలను అణచివేస్తూ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు, యువకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం చర్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసలి సతీష్ మాట్లాడుతూ, ఓటర్లకు భరోసా కల్పించేలా ఉండాల్సిన సర్ ప్రక్రియ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించే విధంగా ఉండకూడదన్నారు. సర్ ప్రక్రియ ద్వారా 15 కోట్ల ఓట్లు తొలగించడం ఒక చిన్న దేశాన్ని రద్దు చేయడంతో సమానమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియ కారణంగా ఎంతోమంది ఓటు హక్కును కోల్పోయారని, పలు రాష్ట్రాలు పాలనాపరమైన నష్టాన్ని ఎదుర్కొన్నాయని అన్నారు. దేశ రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచే కుట్రలో భాగంగానే బీజేపీ సర్ ప్రక్రియను చేపట్టిందని విమర్శించారు. సర్ ప్రక్రియపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్న ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని, అక్రమంగా అరెస్టు చేసిన నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులను వెంటనే విడుదల చేయాలని ముసలి సతీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్ట నరసింహారావు, కుంజా జోగారావు, సంతపూరి సురేష్, చిలక ప్రసాద్, లక్ష్మి , స్వాతి, రమాదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.








# పదేళ్ల ప్రస్థానంలో అన్నపురెడ్డిపల్లి మండలం

- అభివృద్ధిలో మరిన్ని ముందడుగుల కోసం ఎదురుచూపులు!
- విద్యా, ఆధ్యాత్మిక రంగాల్లో ప్రత్యేక గుర్తింపు.. వ్యాపార రంగానికి ఊతం
- కస్తూర్బా, గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు
- శనివారం వెంకన్న సన్నిధిలో.. సోమవారం శివాలయంలో భక్తుల సందడి
- పది నెలల క్రితం ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్తి.. ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయి భవనాలేవీ? 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు ఎప్పుడో?

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 10, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్నపురెడ్డిపల్లి మండలం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సంస్కరణల్లో భాగంగా 2016 అక్టోబర్ 11న ప్రత్యేక మండలంగా ఏర్పడిన అన్నపురెడ్డిపల్లి ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. గతంలో చంద్రుగొండ మండలంలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం ప్రత్యేక మండలంగా అవతరించడంతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. మండలంలోని పది రెవెన్యూ గ్రామాలతో ఏర్పడిన ఈ మండల కేంద్రం ప్రస్తుతం విద్యా, ఆధ్యాత్మిక, వ్యాపార రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. అయితే ఒకవైపు అభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు కొన్ని కీలక సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోకపోవడం స్థానికులలో చర్చనీయాంశంగా మారింది.

**పరిపాలన ప్రజలకు చేరువ.. మండల కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు**

ప్రత్యేక మండలంగా ఏర్పడిన తర్వాత అన్నపురెడ్డిపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. గతంలో వివిధ ప్రభుత్వ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిన ప్రజలకు మండల కేంద్రంలోనే అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయి. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, పోలీస్ స్టేషన్, వ్యవసాయ శాఖ తదితర కార్యాలయాల ద్వారా ప్రజలకు పరిపాలనా సేవలు అందుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అన్నపురెడ్డిపల్లి కేంద్రంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు, ప్రభుత్వ పనులు పూర్తి చేసుకునేందుకు వెసులుబాటు కలిగింది. మండలం ఏర్పడినప్పటి నుంచి స్థానికంగా ప్రభుత్వ సేవల ప్రాధాన్యం పెరిగినప్పటికీ, కార్యాలయాలకు అవసరమైన పూర్తిస్థాయి భవనాలు, మౌలిక వసతుల కల్పనపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**విద్యా రంగంలో అన్నపురెడ్డిపల్లి ముందడుగు**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రం విద్యా రంగంలో క్రమంగా అభివృద్ధి చెందుతూ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను అందిస్తోంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బాలికల గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల విద్యాసంస్థతో పాటు డిగ్రీ కళాశాల అందుబాటులో ఉండటం ఈ ప్రాంతానికి ప్రత్యేకతగా నిలుస్తోంది. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తమ ప్రాంతానికి సమీపంలోనే విద్యను కొనసాగించే అవకాశం కలగడం తల్లిదండ్రులకు ఊరటనిస్తోంది. బాలికలకు ప్రత్యేక విద్యాసంస్థలు, వసతి సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల విద్యను కొనసాగించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. డిగ్రీ కళాశాల అందుబాటులో ఉండటంతో ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతోంది. విద్యాసంస్థల విస్తరణతో అన్నపురెడ్డిపల్లి విద్యా కేంద్రంగా ఎదుగుతూ స్థానిక అభివృద్ధికి తోడ్పడుతోంది.

**విద్యాసంస్థలతో స్థానిక వ్యాపారానికి కొత్త ఊపు**

మండల కేంద్రంలో విద్యాసంస్థలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సందర్శకుల రాకపోకలు పెరిగాయి. దీంతో స్థానికంగా కిరాణా దుకాణాలు, హోటళ్లు, అల్పాహార కేంద్రాలు, ఇతర చిన్న వ్యాపారాలకు కొంతమేర ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ఆలయాలను సందర్శించే భక్తుల రాక కూడా స్థానిక వ్యాపార కార్యకలాపాలకు తోడ్పడుతోంది. గతంతో పోలిస్తే మండల కేంద్రంలో జనసంచారం పెరగడం వల్ల వ్యాపార అవకాశాలు మెరుగుపడుతున్నాయి. విద్య, ఆధ్యాత్మికత, పరిపాలన ఒకేచోట కలిసివస్తుండటంతో అన్నపురెడ్డిపల్లి క్రమంగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంగా గుర్తింపు పొందుతోంది.

**ఆధ్యాత్మిక వైభవానికి ప్రసిద్ధ ఆలయాలు ప్రతీకలు**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నవి ఇక్కడి ప్రసిద్ధ దేవాలయాలు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానాలు భక్తుల విశ్వాసానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఈ ఆలయాలకు మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు. ప్రతి శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపిస్తుండగా, ప్రతి సోమవారం శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజలు, పర్వదినాల సమయంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఈ ఆలయాల వల్ల అన్నపురెడ్డిపల్లికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు స్థానికంగా పూజా సామగ్రి దుకాణాలు, ఇతర వ్యాపారాలకు కూడా కొంతమేర ఆదరణ పెరుగుతోంది.



**పదేళ్ల ప్రస్థానంలో మరింత అభివృద్ధి అవసరం**

మండలంగా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న వేళ అన్నపురెడ్డిపల్లి అభివృద్ధిని పరిశీలిస్తే విద్యా, ఆధ్యాత్మిక రంగాల్లో కొంత పురోగతి కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి రావడం, విద్యాసంస్థలు విస్తరించడం, ఆలయాలకు భక్తుల రాకపోకలు కొనసాగడం వంటి పరిణామాలు మండల కేంద్రానికి ప్రాధాన్యాన్ని పెంచాయి. అయినప్పటికీ ప్రజలకు నిత్యజీవితంలో అవసరమైన మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన భవనాల నిర్మాణం, వైద్య సేవల విస్తరణ వంటి అంశాల్లో మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి అంటే కేవలం కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉండటమే కాకుండా ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందుబాటులో ఉండటం కూడా ముఖ్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పది నెలల క్రితం ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో?**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు, రాత్రివేళల్లో వెలుతురు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు ప్రస్తుతం అసంపూర్తిగా ఉండటం స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. సుమారు పది నెలల క్రితం ప్రారంభించిన ఈ పనులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాటి పూర్తిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలో విద్యార్థులు, వసతి గృహాల బాలబాలికలు, వ్యాపారులు, ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో రహదారి పనులు, లైటింగ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఉండటం అవసరం. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

**పదేళ్లయినా ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయి భవనాలు కరువు**

ప్రత్యేక మండలంగా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నప్పటికీ అన్నపురెడ్డిపల్లిలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన సొంత భవనాలు, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాలు మండల కేంద్రంలో ఉండటం వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతున్నప్పటికీ, వాటికి తగిన భవనాలు, కార్యాలయ గదులు, ఇతర సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. తగిన వసతులు లేకపోవడం వల్ల అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదే సమయంలో వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు. మండలానికి అవసరమైన కార్యాలయ భవనాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

**50 పడకల ఆసుపత్రి ఏర్పాటు హామీ కార్యరూపం దాల్చేదెప్పుడు?**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో విద్యాసంస్థలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు ఉండటంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలనే డిమాండ్‌కు ఈ నేపథ్యంలో ప్రాధాన్యం ఏర్పడింది. గతంలో ఎమ్మెల్యే 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు గురించి ప్రకటించినప్పటికీ, ఆ ప్రతిపాదన ఇంకా కార్యరూపం దాల్చాల్సి ఉంది. మండలంలో జనాభా అవసరాలు, విద్యార్థుల సంఖ్య, గ్రామాల నుంచి వచ్చే రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. 50 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే అత్యవసర వైద్యం, ఇన్‌పేషెంట్ సేవలు తదితర వైద్య సదుపాయాలు విస్తరించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్సల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగకరంగా మారుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. సంబంధిత శాఖలు, ప్రజాప్రతినిధులు ఈ ప్రతిపాదనపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**సాధించిన అభివృద్ధికి తోడు పెండింగ్ పనులపైనా దృష్టి సారించాలి**

అన్నపురెడ్డిపల్లి మండలం పదేళ్ల ప్రస్థానంలో విద్యా, ఆధ్యాత్మిక, పరిపాలనా రంగాల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. విద్యాసంస్థల విస్తరణతో విద్యార్థులకు అవకాశాలు పెరగడం, ప్రసిద్ధ ఆలయాలతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఏర్పడటం, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండటం వంటి అంశాలు అభివృద్ధికి దోహదపడుతున్నాయి. అదే సమయంలో అసంపూర్తిగా ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన భవనాలు, 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు వంటి అంశాలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే మండల ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. పదేళ్ల ప్రస్థానాన్ని మరో అభివృద్ధి మైలురాయిగా మలచాలంటే ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేయడం అవసరం. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకుని పెండింగ్ పనులను పూర్తి చేయాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

**ప్రజల సొమ్ముతో లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటు, ప్రజలకు సేవ చేయాల్సిన కొందరు అవినీతి అధికారులు రాజకీయ పైరవీలతో పోస్టింగ్లు తెచ్చుకొని మణుగూరులో దోపిడీకి తెరలేపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో పైరవీలు చేపించుకొని మణుగూరు ఏజెన్సీ ప్రాంతంలో తిష్ట వేసి అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు జోరుగా వస్తున్నాయి. మణుగూరులో సింగరేణి, బీటీపీఎస్ తదితర భారీ కంపినీలు, ఆదాయ వనరులు ఎక్కువగా ఉంటాయని తెలుసుకొన్న కొందరు అధికారులు కొన్ని లక్షల రూపాయలు ఖదర్ చొక్కాల చేతులకు మార్చి పోస్టింగ్లు వేయించుకున్నారని కొందరు ప్రతిపక్ష పార్టీ నాయకుల దెగ్గర నుంచి వినిపిస్తున్నాయి. పోస్టింగ్లు తీసుకొని పదవి బాధ్యత చేపట్టిన తర్వాత పేద గిరిజనులకు, సామాన్య ప్రజానీకానికి అన్యాయం చేస్తూ బడాబాబులకు కొమ్ము కాస్తున్నారని వినపడుతోంది. అధికార పార్టీలోని కొందరు నాయకులను తమ కార్యాలయాలకు పిలిపించుకొని సెటిల్మెంట్లు, పంచాయతీలు చేస్తూ ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. తాజాగా ఓ సారూ ఓ వ్యాపారి దెగ్గర 20 వేలు డిమాండ్ చేస్తే ఆ వ్యాపారి ఇవ్వనందుకు టార్గెట్ చేసిన ఆ సారూ వ్యవహారం మణుగూరులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.**

# మణుగూరులో పైరవీ అధికారులదే హవా..!

- **పొలిటికల్ లీడర్ల నీడ వెనుక పోస్టింగ్ల దందా..?**
- **సెటిల్మెంట్ అడ్డాగా మారిన కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు..! కొందరు పార్టీ నేతలతో చీకటి ఒప్పందాలు..?**
- **చాప కింద నీరులా అవినీతి.. లక్షలు వెనకేస్తున్న కొందరు అధికారులు...**
- **రైతుల దగ్గర ముడుపులు.. వ్యాపారులకు బెదిరింపులు...**
- **లక్షలు చెల్లించి మణుగూరులోనే పోస్టింగ్లు..! ఆ తరువాత బడాబాబుల మోచేతి నీళ్లు తాగుతూ ఉద్యోగం..!!**
- **ప్లాట్లు, ఈఎంఐల నుండి పెట్రోల్ వరకు చీకటి ఒప్పందాలతో వసూళ్లు...?**
- **20 వేలు ఇవ్వలేదని టార్గెట్ చేసిన ఓ సారూ...**
- **ఇబ్బందులకు గురి చేస్తారమోరని ఓ వ్యాపారి ఆవేదన...**
- **పైరవీ అధికారులతోనే అధికార పార్టీకి చెడ్డ పేరు..?**
- **స్థానిక ఎమ్మెల్యేపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత...!**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 10. ప్రజాజ్యోతి:** మణుగూరులో కొందరు అధికారుల ఆటలు ఇప్పుడు అడ్డు అదుపు లేకుండా పోతున్నాయి. పైరవీతో వచ్చామనే అహంకారంతో కొందరు అధికారులు రెచ్చిపోతున్నారు. ప్రజల కోసం పని చేయాల్సిన కుర్చీల్లో కూర్చొని, అధికార పార్టీ నాయకులకు సలాం కొడుతూ సెటిల్మెంట్ రాజ్యం నడుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. న్యాయం చేయాల్సిన ఏజెన్సీ గడ్డపై బడాబాబులకు ఊడిగం చేస్తూ, చాప కింద నీరులా కోట్లు దండుకుంటున్నారని వినపడుతోంది. రైతుల దగ్గర ముడుపులు, వ్యాపారుల దగ్గర వసూళ్లు, బెదిరింపులు.. ఇదీ ఇప్పుడు మణుగూరు అధికార యంత్రాంగం తీరని తెలుస్తోంది. కొందరు అధికారులు లక్షలు పెట్టి పోస్టింగ్ తెచ్చుకున్నారని, వసూళ్లతోనే ఆ పెట్టుబడిని రాబడుతున్నారని సంచలన ఆరోపణలు ఎగసిపడుతున్నాయి. ఈ పైరవీ బ్యాచ్ వల్లనే అధికార పార్టీకి, స్థానిక ఎమ్మెల్యేకు చెడ్డ పేరు వస్తోందని కొందరు ప్రముఖులు చర్చిస్తున్నారు.

## పొలిటికల్ మెప్పు కోసం ఉడగం...

కొందరు అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ విధులు నిర్వర్తిస్తున్నారనేది స్థానిక ప్రజానీకానికి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిబంధనల ప్రకారం ప్రజలందరికీ సమాన న్యాయం చేయాల్సిన అధికారులు, కేవలం అధికార పార్టీ నాయకులు ఏ పని చెప్పితే ఆ పని చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేల దగ్గర మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని జనం చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులను తమ కార్యాలయాలకు పిలిపించుకొని వారి మాటలకు తలూపుతూ ఫైళ్లను ముందుకు జరుపుతున్నారని జనం నాడి ద్వారా తేలుస్తోంది. సామాన్య ప్రజలు ఎవరైనా తమ పనుల కోసం వెళ్తే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జనం చెప్పడం గమనార్హం. కానీ అధికార పార్టీకి చెందిన నాయకుడు ఫోన్ చేస్తే చాలు, నిబంధనలకు విరుద్ధంగా అయినా వెంటనే పనులు చేసి పెడుతున్నారని విమర్శలు సముద్రపు అలలు లాగా ఎగసిపడుతున్నాయి. ఇలా చేయడం ద్వారానే పైస్థాయిలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే దృష్టిలో మంచి అనిపించుకొని తమ పోస్టింగ్ ను కాపాడుకుంటున్నారని జనం చర్చ ద్వారా తెలుస్తోంది. ఈ తీరు వల్ల ఏజెన్సీలోని పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అర్హులైన వారికి న్యాయం దక్కడం లేదని తెలుస్తోంది. పైరవి అధికారులను వెంటనే బదిలీ చేయకపోతే అధికార పరిపాలనపై ప్రజలకు నమ్మకం పోతుందని బలంగా వినపడుతోంది.

## ఏసీబీ దాడుల్లో ఎందరో అధికారులు...

మణుగూరులో గతంలో కొందరు అధికారులు ఏసీబీ దాడుల్లో దొరకడం సంచలనంగా మారిన విషయం అందరికి తెలిసిందే. నిజాయితీగా పని చేసే అధికారులను కావాలనే ఇక్కడి నుండి బదిలీ చేయించి, అవినీతిపరులను తెచ్చుకున్న సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయని ప్రజలు అంటున్నారు. అందుకే కదా కొందరు అధికారులు ఏసీబీకి దొరికి తమ పరువును అంగట్లో పెట్టుకున్నారని ప్రజానీకం బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు పైరవీతో వచ్చిన కొందరు అధికారులు కూడా అదే బాటలో నడుస్తున్నారని, త్వరలో వారు కూడా ఏసీబీకి చిక్కుతారని అనకొస్తున్నారు. రైతుల దగ్గర ఏ పని కోసం ఎంత డబ్బు తీసుకొని పని చేశారో అన్ని లెక్కలు త్వరలో బయట పెడుతామని అనడం గమనార్హం. గ్రామాల్లో పంచాయతీలు, సెటిల్మెంట్లు చేసి ఏ వ్యక్తుల నుండి ఎంత ముడుపులు తీసుకున్నారో కూడా త్వరలో బట్టబయలు అవుతాయాని చర్చలు చేస్తున్నారు.

## మణుగూరులోనే కోట్ల రూపాయల వనరులు..!

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదాయం వచ్చే వనరులు ఎక్కువగా ఉన్నాయని తెలుసుకున్న కొందరు అధికారులు, లక్షల రూపాయలు పైస్థాయి అధికారులకు, పొలిటికల్ లీడర్లకు చెల్లించి మణుగూరు ప్రాంతంలోనే పోస్టింగ్ లు వేయించుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వచ్చిన తర్వాత అసలు లక్ష్యమైన ఏజెన్సీలోని పేద గిరిజనులకు న్యాయం చేయడం పూర్తిగా మరిచిపోయి, బడాబాబులు, కాంట్రాక్టర్లు, వ్యాపారుల దగ్గర వంగి వారి మోచేతి నీళ్లు తాగుతూ వారికి అనుకూలంగా పనులు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇకపోతే కొందరు అధికారులైతే గత కొన్ని సంవత్సరాలుగా మణుగూరులోనే పాతుకుపోయి, బదిలీ కాకుండా రకరకాల పైరవీలు చేస్తూ కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టుకున్నారని జగమెరిగిన సత్యంగా తెలుస్తోంది. స్థానికంగా ఉండే ఇసుక, మైనింగ్, సింగరేణి, బీటీపీస్, అటవీ వనరులపై పట్టు సాధించి, ప్రతి పనికి ఒక రేటు చొప్పున వసూళ్లకు తెరలేపారని, ఇదంతా పైస్థాయి నాయకుల అండదండలతోనే జరుగుతోందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ఈ అవినీతి ఎంతవరకు వెళ్లిందంటే.. తమ సొంత వాహనాలకు ఈఎమ్ఐలు కట్టించుకోవడం దగ్గర నుండి, వాహనాలకు పెట్రోల్, డీజిల్ కొట్టించుకోవడం వరకు వెళ్లిందనే చర్చ జరుగుతోంది.

## 20 వేలు ఇవ్వనందుకు ఓ వ్యాపారిని టార్గెట్ చేసిన ఓ సారూ...

గత కొన్ని రోజుల క్రితం ఒక ప్రధాన శాఖ చెందిన ఒక అధికారి ఒక వ్యాపారి దగ్గర నుండి ఒక కేసులో 20 వేల రూపాయలు డిమాండ్ చేశారు. అయితే ఆ వ్యాపారి 20 వేలు ఇవ్వకపోయే సరికి నీ పనులు ఎలా నడుస్తాయో, నువ్వు ఎట్లా వ్యాపారం చేస్తావో నేను చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ ఘటన మణుగూరులో సంచలనంగా మారింది. ఇంకపోతే ఈ సారు కొందరు రిపోర్టర్లను, ఆయన సామజిక వర్గానికి చెందిన వ్యక్తులను దగ్గర పెట్టుకొని తన వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సారు టార్గెట్ చేసి విధులు నిర్వహించడం చాలా అలవాటు అనుకుంటా. ఏదైనా పని మీద తన కార్యాలయంకు వస్తే ఆ వ్యక్తిని టార్గెట్ చేయడం, నాకు సిక్స్ సేంత్ చెప్తుతోంది త్వరలో నీ పని అవుతుందని బెదిరించడం వంటివి చేస్తున్నారు.

## పైరవి ప్రభావం ఎమ్మెల్యే పైనే పడుతుందా...

పైరవీతో వచ్చిన కొందరు అధికారుల వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, చివరికి దీని ప్రభావం అధికార పార్టీపై, స్థానిక ఎమ్మెల్యేపై పడుతోందని ప్రతిపక్ష నేతలు, ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి అధికారుల వల్ల పార్టీ నవ్వుల పాలై, కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో నమ్మకం పోయి చివరికి పార్టీని ప్రజలు ఛీ కొట్టే పరిస్థితి వస్తుందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ప్రజల కోసం నిజాయితీగా పని చేసే అధికారులను నియమించాలని, తమ వంకర బుద్ధి, టార్గెట్ చేసి పనులు చేసే నీచమైన అలవాటును కొందరు అధికారులు మార్చుకోవాలని పలువురు చెబుతున్నారు. లేదంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

# అవమానాలను అధిగమించి.. కాంగ్రెస్ జెండానే ఊపిరిగా!











- **ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకొని పార్టీ కోసం త్యాగం..**
- **విద్యార్థి నాయకుడిగా మొదలై.. జిల్లా స్థాయి బాధ్యత వరకు ఎదుగుదల**
- **రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో అనుబంధం..**
- **ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు**

**పినపాక, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి)** రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు.. ఆర్థిక ఇబ్బందులు.. ఎగతాళులు.. అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా కాంగ్రెస్ పార్టీనే తన ఊపిరిగా భావిస్తూ ముందుకు సాగుతున్న నాయకుడు బోడ రమేష్. 2003లో విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం.. రెండు దశాబ్దాలకు పైగా పార్టీతో కొనసాగిన అనుబంధం.. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆర్గనైజేషన్ సెక్రటరీ బాధ్యతల వరకు చేరుకుంది.

రాజకీయాల కోసం తన వ్యక్తిగత జీవితంలోనూ త్యాగాలు చేసిన బోడ రమేష్.. ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకొని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు, ప్రజాసేవకు ప్రాధాన్యమిచ్చినట్లు ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. పదవుల కంటే పార్టీ కోసం పనిచేయడానికే ప్రాధాన్యమిస్తూ, ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న ఆయన ప్రయాణం రాజకీయాల్లో నిబద్ధత, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

**విద్యార్థి దశలోనే రాజకీయ ప్రస్థానం**

2003లో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన బోడ రమేష్.. తొలుత ఎన్ఎస్‌యూఐలో విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘ కార్యకలాపాల నుంచి మొదలైన ఆయన ప్రస్థానం క్రమంగా పార్టీ సంస్థాగత బాధ్యతల వైపు సాగింది. 2021 నుంచి 2026 వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా కొనసాగిన ఆయన.. 2026లో డీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు.

**ఉపాధ్యాయ వృత్తిని వదిలి.. పార్టీ కోసం త్యాగం!**

సాధారణంగా ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత భవిష్యత్తుకు ప్రాధాన్యమిచ్చే పరిస్థితుల్లో.. బోడ రమేష్ మాత్రం కాంగ్రెస్ పార్టీతో తన అనుబంధాన్ని కొనసాగించేందుకు వ్యక్తిగత జీవితంలోనూ త్యాగాలు చేసినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకొని పార్టీ కార్యక్రమాలకు సమయం కేటాయించడం, కార్యకర్తలతో కలిసి పనిచేయడం, రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించడం ఆయన నిబద్ధతను తెలియజేస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.

రాజకీయాల్లో అనుకున్న గుర్తింపు వెంటనే రాకపోయినా.. విమర్శలు, అవమానాలు ఎదురైనా పార్టీని వీడకుండా ముందుకు సాగడం ఆయన ప్రయాణంలో ప్రత్యేక అంశం. కష్టకాలంలో పార్టీతోనే ఉండాలనే సంకల్పంతో పనిచేస్తూ, తన సేవల ద్వారా గుర్తింపు పొందాలని ఆయన ముందుకు సాగుతున్నారు.

**అవమానాల మధ్యా.. ఆగని అడుగులు!**

రాజకీయ ప్రస్థానంలో ఆర్థిక పరిమితులతో పాటు ఎగతాళులు, విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ బోడ రమేష్ వెనుకడుగు వేయలేదని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. విమర్శలకు మాటలతో సమాధానం చెప్పడం కంటే తన పనితీరుతో గుర్తింపు పొందాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొంటున్నాయి. పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలోనూ కాంగ్రెస్‌తో అనుబంధాన్ని కొనసాగించడం ఆయన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన అంశంగా నిలిచింది. కష్టపడి పనిచేసే సాధారణ కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు లభించినప్పుడే పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అవుతుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

**డీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా కీలక బాధ్యతలు**

బీఏ, బీఈడీ విద్యార్హతలు కలిగిన బోడ రమేష్ ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, గ్రామస్థాయి కమిటీలతో సమన్వయం పెంచడం, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. పదవులు పొందడం కంటే అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం, ప్రజల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడం ముఖ్యమనే ఆలోచనతో ఆయన ముందుకు సాగుతున్నారు.

**'రాజీవ్ సంక్షేమ పల్లె బాట'తో ప్రజల్లోకి!–**

'రాజీవ్ సంక్షేమ పల్లె బాట–గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమం ద్వారా గ్రామగ్రామాన పర్యటించి ప్రజలకు చేరువ కావాలని బోడ రమేష్ లక్ష్యంగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, స్థానిక సమస్యలను గుర్తించి సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని భావిస్తున్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించుకోవడంతో పాటు గ్రామస్థాయి కార్యకర్తలను సమన్వయం చేసి పార్టీని బలోపేతం చేయడం ద్వారా తన బాధ్యతలకు న్యాయం చేయాలని ఆయన భావిస్తున్నారు.

**నిబద్ధతగల కార్యకర్తల సేవలకు గుర్తింపు ఎప్పుడు?**

రెండు దశాబ్దాలకు పైగా పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, వ్యక్తిగత జీవితంలోనూ త్యాగాలు చేసిన నాయకులకు తగిన గుర్తింపు లభించాలనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చకు వస్తోంది. ముఖ్యంగా కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా పనిచేసిన నాయకుల సేవలను గుర్తించడం, వారి అనుభవాన్ని పార్టీ బలోపేతానికి ఉపయోగించుకోవడం నాయకత్వానికి కీలకమైన బాధ్యతగా భావిస్తున్నారు.

2003లో విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన బోడ రమేష్ రాజకీయ ప్రస్థానం ప్రస్తుతం జిల్లా స్థాయి సంస్థాగత బాధ్యతకు చేరుకుంది. అవమానాలను అధిగమిస్తూ, వ్యక్తిగత జీవితంలో త్యాగాలు చేస్తూ పార్టీ కోసం పనిచేసిన ఆయన సేవలు భవిష్యత్తులో పార్టీ నిర్మాణానికి ఎంతవరకు దోహదపడతాయన్నది రాబోయే రోజుల్లో ఆయన చేపట్టే కార్యక్రమాలు, ప్రజలతో ఏర్పరచుకునే అనుబంధం ద్వారా స్పష్టమవుతుంది.

# కలవలనాగారంలో ఎక్సైజ్ దాడులు

- 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నాటుసారా స్థావరంపై ఉక్కుపాదం
- ముగ్గురు ఎస్సైల ఆధ్వర్యంలో సంయుక్త దాడులు
- నాటుసారా తయారీ, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- మణుగూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /కరకగూడెం. అక్టోబర్ 10, ప్రజాజ్యోతి**

గ్రామాలల్లో నాటుసారా తయారీ చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం కరకగూడెం మండలం కలవలనాగారం గ్రామంలో మణుగూరు ఎక్సైజ్ స్టేషన్, ఖమ్మం ఎన్ ఫోర్స్ మెంట్, కొత్తగూడెం డీటీఎఫ్ బృందాలు సంయుక్తంగా కలిసి దాడులు నిర్వహించచమని తెలిపారు. ఈ దాడుల్లో అక్రమంగా పులియబెట్టిన 800 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అక్రమంగా బెల్లం పానకాన్ని తయారు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపైనా, అందుకు అవసరమయ్యే ముడి సరుకులు అమ్మే వారిపైనా ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. అక్రమ మద్యం తయారీపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో మణుగూరు ఎస్సై విజయ భాస్కర్, ఖమ్మం ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్సై శ్రీవారి రావు, కొత్తగూడెం డీటీఎఫ్ ఎస్సై సమీవుల్లా ఖాన్, సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, వీరబాబు, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ రోహిత్ రాజు

- పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి.. పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచనలు



**దమ్మపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ శనివారం దమ్మపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

### ›› బాధితులకు సత్వర న్యాయం అందించాలి

వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను శ్రద్ధగా విని చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

### ›› సిబ్బంది పనితీరుపై సమీక్ష

పోలీస్ స్టేషన్ లో వివిధ విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పోలీసింగ్ కు సంబంధించిన వెబ్ అప్లికేషన్లపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న వస్తువులను (క్రైమ్ ప్రాపర్టీ) పరిశీలించి, వాటి భద్రత, నిర్వహణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### ›› అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆన్ లైన్ మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని తెలిపారు.

### ›› డయల్ 112కు తక్షణమే స్పందించాలి

పోలీసులు పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాల ద్వారా నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్ 112కు ఫోన్ కాల్ వచ్చిన వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు.

### ›› సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.

## సీతారామ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- రీ-సర్వే నిర్వహించి పరిహారం చెల్లించాలి: కారం శ్రీరాములు

**దమ్మపేట, అక్టోబరు 10. ( ప్రజా జ్యోతి ):** సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్వాసితులకు న్యాయం చేయాలని నిర్వాసితుల సంఘం నాయకుడు కారం శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దమ్మపేట మండలం జగ్గారంలో నిర్వహించిన నిర్వాసిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు సరైన నోటీసులు ఇవ్వకుండా సంతకాలు సేకరిస్తూ, పనుల పేరుతో నిర్వాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాలువకు వెంటనే రీ-సర్వే నిర్వహించి భూముల సరిహద్దులను గుర్తించిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. సర్వేలో ఇతర భూముల సర్వే నంబర్లు చేరినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలన్నారు. మిగిలిన భూముల్లో బోర్లు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించి సాగుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎకరాకు రూ.40 లక్షల వరకు పరిహారం రావాల్సి ఉండగా రూ.8 లక్షలే ఇచ్చారని, అర్హులైన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కూడా అందలేదని శ్రీరాములు ఆరోపించారు. ఆరేళ్లుగా ఆలస్యమైన పరిహారానికి వడ్డీతోపాటు పెండింగ్ నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నిర్వాసితులు కల్లూరి రాజేష్, కురసం చిన్నరాజు, వంక ముత్యాలరావు, కాక సీత, జెడి బంగారు, వాగ్గెల బాలకృష్ణ, కొమరం రాము, సున్నం వెంకటేశ్వర్లు, మడకం నరసింహారావు, కారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ బాలాజీ స్వామివారి సన్నిధిలో భక్తుల సందడి

- భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసిన కారం రాజేష్, లక్ష్మీ దంపతులు



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 10, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ వారం కూడా వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వారం స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన కారం రాజేష్, లక్ష్మీ దంపతులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం, పూజలు, అన్నప్రసాద వితరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా మహిళా కార్యదర్శిగా పద్దం విజయలక్ష్మి



**దమ్మపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పద్దం విజయలక్ష్మిని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా మహిళా కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా పద్దం విజయలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా మహిళా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీ సమాజ అభివృద్ధికి, గిరిజన మహిళల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

## దేవి శరన్నవరాత్రులకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి

**ఇల్లందు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి)** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గ మాత అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కోరారు. శనివారం వార్డు కౌన్సిలర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రతిరోజూ వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దుర్గామాతను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా మనశ్శాంతి, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమని వార్డు కౌన్సిలర్ దండు సారయ్య పేర్కొన్నారు. దుర్గామాత అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శనం చేసుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులందరూ ఐకమత్యంతో, భక్తిభావంతో విజయవంతం చేయాలని కోరారు. అదేవిదంగా అమ్మవారు నేడు మొదటి రోజైనా శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి, 12వ తేదీ గాయత్రీ దేవి, 13వ తేదీ అన్నపూర్ణాదేవి, 14వ తేది కాత్యాయిని దేవి, 15వ తేదీ లలిత త్రిపుర సుందరి దేవి, 16వ తేదీ సరస్వతి దేవి, 17వ తేదీ శ్రీ మహా చండీ దేవి, 18వ తేదీ శ్రీ దుర్గాదేవి, 19వ తేదీ మహిషసుర మర్దిని, 20వ తేదీ శ్రీ రాజరాజేశ్వ రి అలంకారాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.



## లక్ష్యంతో ముందుకు సాగాలి





**ములకలపల్లి, అక్టోబర్ 10, (ప్రజాజ్యోతి):** అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు తమ విజయాలను వివరిస్తూ బాలికల్లో స్ఫూర్తి నింపారు. కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు విజయానికి అడ్డంకులు కావని, లక్ష్యసాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం బాలికలు సినిమా పాటలు, జానపద గేయాలకు చేసిన బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిస్టర్స్ ఉదయ, రీమా, దీప్తి, సంస్థ సిబ్బంది నాగరాజు, బాలరాజు, సుజాత, సంధ్య, నాగమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు భద్రాచలం పరిధిలో గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భద్రాచలం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) కె. జీవన్ కుమార్ తెలిపారు. 132 కేవీ భద్రాచలం సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే లైన్‌లో అత్యవసర మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, మరమ్మతు పనులకు సహకరించాలని ఆయన కోరారు.

## రేపు ఆల్ పెన్షనర్స్ కార్యాలయంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం

- **సంఘం డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు**




**భద్రాచలం, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ శరత్ మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిశుక్లం (క్యాటరాక్ట్) సమస్య ఉన్నవారిని ఆసుపత్రి సొంత వాహనాల్లో వరంగల్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి భద్రాచలానికి తీసుకువస్తారని తెలిపారు. వారికి రవాణా, వసతి, మందులు, భోజన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారని వివరించారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా హెల్త్ కార్డు తీసుకురావాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఉచిత కంటి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటుందని బందు వెంకటేశ్వరరావు తెలిపారు.

## వద్దిపేట ఎత్తిపోతలకు నిధులు విడుదల చేయాలి

- **పరిటాల సంతోష్ కుమార్**



**చర్ల, అక్టోబర్ 10: (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని వద్దిపేట వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం వెంటనే మంజూరు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల యువ నాయకుడు పరిటాల సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ పథకం అమలైతే మండలంలోని సుమారు 7 వేల ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు వేలాది రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వద్దిపేట ఎత్తిపోతల పథకం కల నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లో నాయకులు హామీలు ఇస్తున్నప్పటికీ, ఎన్నికల అనంతరం వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల నీటి అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు.గోదావరి ఉపనది తాలిపేరు నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే ఎగువ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. వద్దిపేట వద్ద ఎత్తిపోతల పథకం పూర్తయితే సుమారు 7 వేల ఎకరాల భూములకు నీటి సౌకర్యం కలుగుతుందని, పరిసర గ్రామాల్లోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. వర్షాకాలంలో వృథాగా గోదావరిలో కలిసిపోయే నీటిని నిల్వ చేసి అవసరమైన ప్రాంతాలకు మళ్లించడం ద్వారా రైతులు ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని దీనివల్ల వ్యవసాయ దిగుబడులు పెరగడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే బడ్జెట్ కేటాయించి వద్దిపేట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు ప్రారంభించాలని పరిటాల సంతోష్ కుమార్ కోరారు. ఈ విషయంలో జాప్యం కొనసాగితే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా బీజేపీ మండల సమావేశం

- ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకుల చర్చ
- సేవా జ్యోతి కార్యక్రమాల అమలుపై సమీక్ష



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 10, (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు జుబురు రమేష్ ఆధ్వర్యంలో శనివారం మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జటోత్ వెంకన్న హాజరయ్యారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా జ్యోతి కార్యక్రమాల అమలుపై మండల నాయకులు సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమాల లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సేవా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బాల వెంకటరెడ్డి, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి పొదిలి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు నాగల నరసింహారావు, రాచకొండ వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు బాల్య సత్యనారాయణ, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కాకా శివప్రసాద్ పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో యామిని హాస్పిటల్ చిన్న పిల్లల వైద్య నిపుణులు యామిని కుమారి జన్మదిన వేడుకలు

- **మానవసేవే మాధవసేవ అనే భావంతో ఏజెన్సీ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానని హామి**
- **యామిని కుమారి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్**




**లక్ష్మీదేవి పల్లి, 10 అక్టోబర్ ,ప్రజాజ్యోతి:** యామిని హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య నిపుణులు యామిని కుమారి తమ నివాసం అయిన లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది ఈ జన్మ దిన సందర్భంగా నిరుపేద కుటుంబాలకు తక్కువ ఫీజులకే చక్కటి వైద్యం అందిస్తూ ఇంక ముందు కూడా పేదలకు ఉచితంగా వైద్య సేవ చేయడానికి ముందుకు వస్తానని తెలియపరచడం జరిగింది అదేవిధంగా మారుమూల ఏజెన్సీ ప్రాంతాలలో ఉచిత ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతానని హామీ ఇవ్వడంతో ఈ జన్మ దిన వేడుకలకు హాజరైన సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ తరంలో ఇటువంటి మనస్తత్వం కలిగిన వైద్యులు మన జిల్లాకు అందుబాటులో ఉండడం మన అందరి అదృష్టంగా భావిస్తూ వారికి ఆ దేవుని ఆశీస్సులు ఆశీర్వాదాలు ఎప్పుడూ నిండుగా ఉండాలని వారికి ప్రత్యేకంగా సేవలాల్ బంజారా సంఘం నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సేవలాల్ బంజారా సంఘం నాయకులు రతన్ నాయక్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ నాయక్ విజయ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## పూల సోయగాలతో మెరిసిన మెడికల్ కాలనీ..

- **ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు!**
- **తెలంగాణ సంస్కృతి, మహిళల ఐకమత్యానికి ప్రతీక బతుకమ్మ**

**భద్రాచలం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు భద్రాచలం మెడికల్ కాలనీలో అంబరాన్నంటాయి. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా స్థానిక మెడికల్ కాలనీ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పక్క సందులో మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ, అటవీ అభివృద్ధి అధికారిణి నిషా మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జరుపుకునే ఈ పూల పండుగ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెబుతుందని అన్నారు. మహిళల ఐకమత్యానికి, తెలంగాణ వారసత్వ వైభవానికి ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. మెడికల్ కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. దీంతో మెడికల్ కాలనీ పరిసరాలు పూల పరిమళాలు, బతుకమ్మ పాటలతో సందడిగా మారాయి.

